

పెద్దదర్గాలో అషురెడ్డి, మహేష్ విట్టా ప్రార్థనలు

కడప అర్బన్ : మంగళవారం దర్గా కు విచ్చేసిన బిగ్ బాస్ ఫేమ్, యాక్టర్ అషురెడ్డి, మహేష్ విట్టా, భూపాల్ రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న అషురెడ్డి, మహేష్‌విట్టా

కేంద్ర బడ్జెట్‌పై కోటి ఆశలు



పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న 2023-24 బడ్జెట్‌పై అందరిదృష్టి నిలిచింది. జిల్లాలోని విమాన, రైల్వే, ఉక్కు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభించాల్సి ఉంది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, పెండింగ్ రైల్వేలైన్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, ఉపాధి హామీ పథకం నిధుల పెంపు, రైతుల ఆదాయం రెట్టింపు, మధ్యతరగతి నుంచి 4.6 కోట్ల మంది నుంచి 16 కోట్ల మంది దారిద్ర్యంలోకి జారుకున్న నేపథ్యంలో పేదల అభ్యున్నతి, నిత్యావసరాల ధరల తగ్గింపు సమస్యలు పేదలకు చుట్టుముట్టడం తెలిసిందే. ఇటువంటి సామాన్యులకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత లభించనుందా, లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది. 2023-24 బడ్జెట్ ప్రత్యేకతను సంతరించుకుంది.

- ఉక్కు పరిశ్రమకు ఊతమిచ్చేనా?
- కడప-బెంగళూరు రైల్వేలైన్‌కు నిధులు కేటాయించేనా

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్ 2023- 24 సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రధానంగా రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, సుమారు రూ.1050 కోట్ల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల పెండింగ్, కడప నుంచి విజయవాడకు రైల్వేలైన్, కడప-బెంగళూరు రైల్వేలైన్లకు కేటాయిం పులపై ఆసక్తి నెలకొంది. వీటిపై ఎనిమిదేళ్లుగా వామపక్ష, ఉక్కు సాధన కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నడుస్తున్న సంగతి తెలిసిందే. గత ఎనిమిది బడ్జెట్ల ఆర్థిక సర్వే, ఎటిఆర్ నివేదికల్లో ఉక్కు పరిశ్రమ ప్రతిపాదన లేకపోవడంతో ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. ఇది ఉద్యమాలకు కేంద్రబిందువుగా మారింది. 2023-24 బడ్జెట్‌లోనైనా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, మైన్స్ కేటాయింపు, విమానాశ్రయ రన్‌వే పొడిగింపు పూర్తి, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు, కడప రైల్వేస్టేషన్ ఆధునీకరణ కేటాయింపులు చేయాల్సి ఉంది. కొన్ని రైల్వేలైన్లకు బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్ర వాటా ఉంటుందని హామీ ఇచ్చినప్పటికీ ఎటువంటి కేటాయింపులు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కడప- బెంగళూరు రైల్వే ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పును కోరుతూ లేఖ రాసిన నేపథ్యంలో కేటాయి ంపులపై ఉత్కంఠ నెలకొంది. రెండేళ్లుగా సాధారణ బడ్జెట్‌లో రైల్వేబడ్జెట్‌ను కలిపే యడంతో రైల్వే ప్రాజెక్టుల కేటాయింపుల్లో సమాన ప్రాధాన్యత దక్కు తుందనే ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కడవ-బెంగళూరు, ప్రొద్దుటూరు-కంభం, భాకరాపేట-గిద్దలూరు, ఓబులవారిపల్లి-వాల్మీకి పురం పెండింగ్ ప్రాజెక్టులుగానే ఉన్నాయి. కడప-బెంగళూరు ప్రాజెక్టు రెండవ దశలో భాగంగా పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా చిత్తూరు జిల్లా వరకు చేపట్టాల్సిన పనులు నిలిచిపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఓబులవారిపల్లి- కృష్ణపట్నం రైల్వేలైన్ ప్రారంభించినప్పటికీ, సరుకు సరఫరాకు మాత్రమే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రొద్దుటూరు- కంభం, భాక రాపేట- గిద్దలూ రు, ఓబులవారిపల్లి- వాల్మీకి పురం రైల్వేలైన్ ప్రతిపాదనల దశ దాటక పోవడం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. కడప-బెంగళూరు, కడప-విజయవాడ లైన్ కేటాయింపు ఆశలపైనే అందరి దృష్టి నిలి చింది. నందలూరు రైల్వే లోకోషెడ్‌కు ప్రత్యామ్నాయం, షిర్డీకి రైలు, తిరుపతి-మచిలీపట్నం రైలు కడప మీదుగా వెళ్లే అవకాశం కల్పిం చాలనే డిమాండ్లకు మోక్షం లభించడంపై ఆసక్తి నెలకొంది. తిరుపతి, యర్రగుంట్ల ప్రాంతాల నుంచి రాజధానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్న నేపథ్యంలో కడప-విజయవాడ, కడప-బెంగళూరు రైలుమార్గాలకు నిధుల కేటాయింపులు చేయాలని ప్రజానీకం ఎదురు చూస్తోంది.



లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్



ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి, తదితర అంశాలపై సమీక్షించారు. వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో విస్తృత సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులకు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. సూక్ష్మ నీటి సాగు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. రబీ పంటల ధాన్యాన్ని రైతుల వద్దనే నిల్వ లేకుండా గిడ్డంగుల్లో భద్రపరిచేలా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపెట్టాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి, ఇతర రబీలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. సహకార సంఘ రైతులకు పంట రుణాలతో పాటు ఆసక్తి ఉన్న వారికి గోడౌన్ల ఏర్పాటు కోసం సహాయ సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ పథకాల లక్ష్య సాధన కోసం సంబంధిత బ్యాంకు కంట్రోలర్లు, సంబంధిత అధికారుల సమన్వయ యంత్ర చిత్తశుద్ధితో ముందుకు సాగాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహాన్ని అందిస్తూ ఆయా రంగాల్లో నైపుణ్య శిక్షణతో పాటు, పెట్టుబడి మొత్తాన్ని అందించేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.శారదా, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రారెడ్డి, డిసిఓ సుభాషిణి, ఎల్డిఎం దుర్గాప్రసాద్, హార్టికల్చర్ జిల్లా అధికారి, మార్కెటింగ్ శాఖ డిఎం, వివిధ ప్రాధాన్యత రంగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'ఉక్కు'కు నిధులు కేటాయించండి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కడప స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేసెందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయరంగాలు బాగా వెనకబడి పోయాయన్నారు. రాయలసీమ ప్రాంతంలో ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే ఈ ప్రాంతంలో ఉన్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. సకాలంలో వర్షాలు కురవక నిత్యం కరువు కాటకాలతో వ్యవసాయం బాగా దెబ్బతిందని చెప్పారు. దీని కారణంగా రైతాంగం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలంటే ప్రభుత్వ రంగంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం తక్షణ అవశ్యమని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న పార్లమెంట్ సభ్యులందరూ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసేందుకు వీలుగా అవసరమైన నిధులను సాధించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించిన నిధులు కూడా నిలిపి వేయడం బాధాకరమన్నారు. గతంలో కడప జిల్లాకు రూ. 50 కోట్లు కేటాయించారని, ఆ నిధులు అంగన్వాడీ భవనాలు నిర్మాణానికి సరిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించేలా చూడాలని ఆయన ఎంపీలను కోరారు. రాష్ట్రంలో ఉన్న ఎంపీలందరూ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం కలిసికట్టుగా చర్చించి ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించేలా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బాల్య వివాహాల నష్టాలను వివరించాలి

- ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు లక్ష్మీదేవి

కడప : బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను పురోహితులు వివరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు లక్ష్మీదేవి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశ హాల్‌లో జిల్లాలోని హిందూ మత పెద్దలు పురోహితులకు బేటి బచావో- బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీదేవి మాట్లాడుతూ పురోహితులు ప్రవచనాలు, పూజలు, వ్రతాలలో పాల్గొన్నప్పుడు ఆడపిల్లల ప్రాముఖ్యతను, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి వివరించాలని సూచించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాల పూర్తయినప్పుడే వివాహం చేయాలని చెప్పారు. సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లలు, మగపిల్లలు సమానమని, చిన్నప్పటినుండి తారతమ్యం లేకుండా చూడాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎం.ఎన్. రాణి మాట్లాడుతూ సమాజంలో మహిళలు మగవారితో తగ్గకుండా పోటీపడి అన్ని రంగాల్లో రాణిస్తున్నారు అన్నారు. అనంతరం లక్ష్మీదేవి కడప అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుడ్ల గోడౌన్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హిందూ మత పెద్దలు, పురోహితులు, ఎండోమెంట్ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు సునీత, సునీత రాజు, ప్రసన్న, విజయ, వినోద్ కుమార్, మహేశ్వర, యూనుస్ బాష, గోవింద్ రాజు, జగదీష్ బాబు, మునీంద్ర, డిసిపియు సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిజిబి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప అర్బన్ : ఎపిజిబిలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగుల సమస్యలను పిఎఫ్ కమిషనర్ పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శివశంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ పునరుద్ధరణ, ప్రావిడెంట్ ఫండ్ నిధులు చెల్లించాలని పిఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జనవరి నుంచి రిటైర్డ్ అవుతున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు, కొత్త ఫ్యామిలీ పెన్షనర్స్‌కు రావాల్సిన పిఎఫ్ నిధులు, పెన్షన్ చెల్లింపులను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కార్యాలయం కడప వారు పూర్తిగా నిలిపి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుకు రావలసిన నిధులు తక్షణమే పెన్షన్ ఫండ్ ట్రస్ట్ కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనువా సులురెడ్డి మాట్లాడుతూ ప్రావిడెంట్ అధికారులు ఇంతవరకు ఎలాంటి నిర్మాణాత్మక మైన చర్యలు తీసుకోక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాని చెప్పారు. కార్యక్రమానికి మద్దతుగా ఎల్ఐసి డివిజన్ నాయకులు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇది పరిస్థితులు కొనసాగితే ఆత్మ హత్యలే శరణ్యం గా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కడప, కర్నూలు, ఒంగోలు, అనంతపురు, నెల్లూరు, తిరుపతి, బాపట్ల, నంద్యాల, కదిరి, అన్నమయ్య జిల్లాలకు చెందిన నాయకుల, బ్యాంకు యూనియన్ నాయకులు శివారెడ్డి, జగదీష్ రెడ్డి, మొహమ్మద్, విశ్రాంత ఉద్యోగులు బి.నరేంద్ర రెడ్డి, లక్ష్మినరసియ్య, సుబ్బరామ్, నాగయ్య పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణకు సంకల్ప దీక్ష

కడప అర్బన్ : ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న 'కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం' రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని ధర్మస్థలి ప్రాంగణంలో సంకల్ప దీక్ష సభ నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 1న పాత ఫించన్ విధానం పునరుద్ధరించనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో గ్యారంటెడ్ పెన్షన్ విధానాన్ని విరమించుకోవాలని, ఇచ్చి హామీ ప్రకారం ముఖ్యమంత్రి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ధర్మస్థలి ప్రాంగణంలో నిర్వహించబోయే సంకల్ప దీక్షలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం

కడప : రాహుల్ గాంధీ దేశంలో, రాష్ట్రంలో చేపట్టిన భారత్ జోడోయాత్ర తో కాంగ్రెస్ పార్టీ మరింతగా ప్రజల్లోకి వెళ్లి బలోపేతం అవుతుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి అన్నారు. మంగళవారం 31వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ రహమాతుల్లాఖాన్ ఆధ్వర్యంలో భారత్ జోడో యాత్ర సంబరాలు నిర్వహించారు. రాహుల్ భారత్ జోడో యాత్ర విజయ వంతం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి సత్తార్, కులాయప్ప, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, అసిఫ్ ఖాన్, 1 వ డివిజన్ ఇన్‌చార్జి మామిళ్ళ నరసింహులు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అమీర్ బాషా, యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు లక్ష్మయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు బాబు, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, లేబర్ సెల్ జిల్లాఅధ్యక్షులు చెప్పాలి పుల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపి పిటిడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప అర్బన్ : ఎపిపిటిడి (ఆర్‌టిసి) కడప జోన్ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య, అధ్యక్ష, కార్యదర్శులు కె. కృష్ణకుమార్, ఎన్. ఆర్. శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. గోపినాథ రెడ్డికి వినతి పత్రం అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జోన్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు 2022, ఏప్రిల్ 14న నిలిపి వేసిన అన్ని కేటగిరీల రిక్వెస్ట్ బదిలీలు, అంతర్ జిల్లాల బదిలీలు ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతలు కల్పించి పనిబారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి పిఎన్‌బిరెడ్డి, వైఎస్ఆర్ జిల్లా కార్యదర్శి రామమూర్తి, నాన్ ఆపరేషన్ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు రంగనాథ్, అంకిరెడ్డి పాల్గొన్నారు

జిల్లా అరసం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్



జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడిగా ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి, ప్రధానకార్యదర్శిగా డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు ఎన్నికయ్యారు. జిల్లా మహాసభలు పూర్తయిన సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నురు. గౌరవ సలహాదారులుగా డాక్టర్ పి. సంజీవమ్మ, డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా డా.ఎస్. రాజగోపాలరెడ్డి, ఎమ్. గాయత్రిదేవి, కోశాధికారిగా డాక్టర్ కొప్పోలురెడ్డి, శేఖరరెడ్డి, నిర్వాహక కార్యదర్శిగా పవన్ కుమార్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఆర్. భవాని, జి. తిరుమల రాజు, నెల్లూరు వెంకట రవికుమార్, ఓ బిలి వెంకటయ్య, బండారు రవి ఎక్కలూరు ఆదెన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ రచనలకు భాషాభివృద్ధి, దేశాభివృద్ధి పరమలక్ష్యం కావాలన్నారు. సాహిత్యం ద్వారా ప్రగతికర ఆలోచనలను జనంలోకి తీసుకెళ్ళే కార్యక్రమాలను అరసం నిర్వహిస్తుందన్నారు.

నూతన భవనంలోకి డ్రగ్‌కంట్రోల్ కార్యాలయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం

కడప సిటీ : నగర శివారులోని రిమ్స్ డెంటల్ ఆస్పత్రి వెనుక ప్రాంగణంలో నిర్మించిన నూతన భవనంలోకి డ్రగ్ కంట్రోల్ (ఔషధ నియంత్రణ పరిపాలన) కార్యాలయాన్ని మార్చారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జిఒ కాలనీలోని వెంకటేశ్వర ఆలయం వద్ద నున్న కార్యాలయాన్ని రిమ్స్ డెంటల్ ఆస్పత్రి ప్రాంగణంలో నూతన భవనంలోకి మార్చడం హర్షణీయమన్నారు. కీ.శే. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి దూర దృష్టితో ఆలోచించి రిమ్స్ ఆస్పత్రిని నిర్మించారని చెప్పారు. నగర వాసులకేగాక జిల్లా ప్రజలకూ అన్ని రకాల ఆరోగ్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఔషధ దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఔషధాల్లో కల్తీ నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఔషధ నియంత్రణ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు నిత్యానంద రెడ్డి, ముంతాజ్ బేగ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటివ్ ఎడి నాగ కిరణ్ కుమార్, ఎపిఎంఎస్ఐడిసి ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ ఎ.బి.సురేంద్రనాథ్ రెడ్డి, డిస్ట్రిక్ డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్స్ మాధవి, జయరాముడు, ఆఫీస్ సూపరింటెండెంట్ శివ శంకర్, హజ్‌హౌస్ చైర్మన్ గౌసులాజమ్, కార్పొరేటర్ షఫీ,వైసిపి నాయకులు జమాల్ బాషా పాల్గొన్నారు.

పాస్టర్‌కు సేవా పురస్కార్ అవార్డు

కడప : 48వ డివిజన్ కృపా కాలనీకి చెందిన న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పి మహేష్‌కు బృంద వృద్ధాశ్రమం 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు సేవా పురస్కార్‌ను అవార్డును మంగళవారం అందజేశారు. ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బృంద వృద్ధాశ్రమం నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధారాణి మాట్లాడుతూ కడప నగరం కృపా కాలనీలో పేద ప్రజల మధ్య ఆధ్యాత్మిక సేవలతో పాటు మానవ సమాజ సేవ కార్యక్రమాలు సంతోషకరమని కొనియాడారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.ఆనంద్, వాలంటీర్ పి.రవితేజ అనేక సేవ సంస్థల ప్రముఖులు, పెద్దలు, వైద్యులు పాల్గొన్నారు.

కెవి పేరెంట్స్ అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ

కడప : కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రులు ప్యాకెట్ కేలండర్‌ను తీసుకురావడం అభినందనీయమని ఆర్‌టిసి రాష్ట్ర చైర్మన్ ఎ. మల్లిఖార్జునరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్యాకెట్ కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేంద్రీయవిద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు చైర్మన్‌ను సత్కరించారు. పూర్తిస్థాయిలో కేంద్రీయవిద్యాలయకు బస్సులు నడపడంలో ఆర్టీసీ కృషి మరువలేనిదిని చెప్పారు. ఆర్టీసీ సంస్థకు కేవీ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కేవీ పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్, కోశాధికారి జితేంద్ర,ఉపాధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, సంయుక్త కార్యదర్శి, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్‌పి అన్బురాజన్ పిలుపునిచ్చారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన 'మొబలైజేషన్' ముగింపు కార్యక్రమం స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా పరిశీలన వాహనంపై వెళ్లి ఎఆర్ ప్లటూన్లను పరిశీలించారు. ఆతర్వాత ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షించడంలో రాష్ట్రంలోనే జిల్లా పోలీసులకు మంచి పేరుందన్నారు. ఇందులో ఏ.ఆర్ పోలీసుల పాత్ర కీలకంగా ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా ప్రశాంతంగా ఉందంటే గతంలో పని చేసిన అధికారుల, సిబ్బంది త్యాగాలే కారణమన్నారు. మొబిలైజేషన్ ప్రక్రియ లో కీలకంగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేశారు.



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి


శ్రీహరి డిగ్రీ కళాశాలలో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని శ్రీహరి డిగ్రీ కాలేజీలో మంగళవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి, రెండవ, తృతీయ సంవత్సరాలకు చెందిన సైన్సు విద్యార్థుల చేత సైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులు తయారు చేయించారు. ముఖ్య అతిథులుగా ముఖ్య అతిథులుగా జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి హాజరై ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి పరిశోధనలు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి అన్ని రకాల చర్య తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మరియు విద్యార్థులకు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న గౌస్ అజామ్

140 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 140 వసంతాల వేడుకను ఈనెల 1న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ గౌస్ అజాం పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ దేశం లోనే మొట్టమొదటి బీమా సంస్థ అన్నారు. మరి ఏ ఇతర సంస్థల జీవిత బీమా పథకాల కంటే చాలా ఎక్కువ రాబడి ఇస్తుందన్నారు. అంతే కాకా స్టాంప్ డ్యూటీ, లాభాపేక్ష ఏమాత్రం లేని, ప్రత్యేక సిబ్బంది, కార్యాలయాలు, అద్దెలు, జీతాలు , ఫర్నిచర్ లాంటి ఖర్చులు లేని సంస్థ అన్నారు. అందుకే మిగిలిన జీవిత బీమా సంస్థ ల కంటే తక్కువ చెల్లింపుతో ఎక్కువ రాబడి పొందవచ్చన్నారు. దేశవ్యాప్తంగా విస్తరింపబడిన సుమారు 1,50,000 లకు పై చిలుకు పోస్ట్ ఆఫీసుల ద్వారా మూల మూలకు విస్తరించి ఉండి పోస్టల్ డిపార్ట్మెంట్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కి సంబంధించిన సేవలను అందిస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రజల కోసం ప్రత్యేకంగా గ్రామీణ తపాల జీవిత బీమా సౌకర్యం ఉందని తెలిపారు.జీవిత బీమా పొందాలనుకునే వార వివిధ సంస్థల పథకాలను సరిపోల్చుకుని పొందాలని కోరారు. తపాల జీవిత బీమా కు మించిన పథకాలు మరి ఎక్కడా లభించవన్నారు. ఇది భారత ప్రభుత్వం హామీ ఇచ్చే భారత ప్రభుత్వం ద్వారా నిర్వహించే పథకమని గమనించాలని కోరారు.

పేదలకు భూములు చూపాలి

కలసపాడు : పేదలకు భూములు చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. గురయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అసైన్‌మెంట్ లబ్ధిదారులకు సర్వే చేసి భూములు చూపించడంలో ప్రభుత్వ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. పిడుగుపల్లె, కలవ కట్ట, శంఖవరం, కటికిందపల్లె, బలిజపల్లె, అక్షితుపల్లి గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి రెవెన్యూ, ఆర్‌డిఒ, కలెక్టర్ కార్యాలయ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయందని వాపోయారు. వెంటనే లబ్ధిదారులకు భూములను సర్వే చేసి చూపించాలని, లేని పక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరి ంచారు.

సిపిబ్రౌన్ గ్రంథాలయానికి 300 పుస్తకాలు బహూకరణ

కడప అర్బన్ : నగరానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కడప కోటిరెడ్డి కోడలు కోటిరెడ్డి పద్మావతమ్మ 300 పుస్తకాలను మంగళవారం ఉదయం తన స్వగృహంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎంతో విలువైన పుస్తకాలు బహూకరించడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో పద్మావతమ్మ కుమారుడు కోటిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, కోడలు కోటిరెడ్డి రమ్యస్మిత పాల్గొన్నారు.

వైవీయూలో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టాలి

కడప అర్బన్ : వైవీయూలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.ఆర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం వైవీయూ ఎస్‌ఎఫ్ఐ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీలో లా, బిఇడి,ఫార్మసీ టెక్నికల్ కోర్సులు ప్రవేశపెట్టి అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో టెక్నికల్ కోర్సులు లేక పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థిని, విద్యార్థులు, ఇతర ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను, టెక్నికల్ విద్యను అభ్యసించ లేక దూరమవుతున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉపాధి అవకాశం కల్పించాలంటే కొత్త కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల జీవితంలో వెలుగులు నింపాలని వారన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ వైవీయూ కమిటీ నాయకురాలు సోనియా, దీప్తి, పుష్ప, ఉదయశ్రీ, దేవా పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో పార్టీ సమావేశాలా? : టిడిపి

చెన్నూరు : ప్రభుత్వ కార్యాలయంలో పార్టీ సమావేశాలు ఎలా నిర్వహిస్తారని టిడిపి మండల అధ్యక్షులు కల్లూరు విజయభాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలో వైసిపి సమావేశాలు నిర్వహించడం ఏంటంటూ ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ అధికారులు సైతం అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లికార్జునరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మైనార్టీ నాయకులు షబ్బీర్ హుస్సేన్, చెన్నూరు టౌన్ కన్వీనర్ ఆకుల చలపతి, మండల తెలుగుదేశం బీసీ సంఘం అధ్యక్షులు ఆటో బాబు, వార్డు మెంబర్ శ్రీకాంత్, సుధాకర్ రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

కడప అర్బన్ : కొత్త రిమ్స్ సమీపంలో నిర్మించిన అంబేద్కర్ భవన్ పట్ల వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యం వహిస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు విమర్శించారు. మంగళవారం అంబేద్కర్ భవనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి స్థలం, నిధులు కేటాయించారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక పనులు పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన పనులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిధులు కేటాయించకుండా, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. దళితుల పట్ల చిన్నచూపు చూడడం తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్. ఇమ్రాన్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.54 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం

కలసపాడు : మండలంలోని కలసపాడు గ్రామపంచాయతీలో రూ. 54 లక్షల నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు పనులను చేపట్టామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అల్లాబకాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కాంక్రీట్ పనులను పరిశీలించారు. కలసపాడు పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలుగా ఓవర్ హెడ్ ట్యాంకు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీంతో రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య ఉండదని చెప్పారు. 90 వేల కెపాసిటితో ట్యాంకును నిర్మిస్తున్నామని తెలిపారు. అన్ని పనులు పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులో తెస్తామని పేర్కొన్నారు.

అనుమతి లేని కట్టడాలపై చర్యలు

కలసపాడు : మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆయా పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విస్తరణాధికారి జి.మురారి తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో మేజర్ పంచాయతీలైన తెల్లపాడు, కలసపాడు పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. కలసపాడు, రామాపురంలో నిర్మించే గృహాలకు పంచాయతీ ఆమోదముద్ర తప్ప నిసరిగా ఉండాలన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

పెండ్లిమర్రి : అంగన్వాడీ కార్యకర్త, ఆయాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెలురుపాడు, పాత సంగటిపల్లి, నందిమండలం గ్రామాల్లో పోస్టులు ఖాళీలున్నాయని, అభ్యర్థుల వయస్సు 2023 జులై 1న 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. కార్యకర్త పోస్టుల కు పదో తరగతి, ఆయా పోస్టులకు ఏడవ తరగతి ఉత్తీర్ణత కావాలన్నారు. ఈనెల 6లోగా దరఖాస్తులను ఐసిడిఎస్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఆలయ వార్షికోత్సవంలో భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-పులివెందుల రహదారిలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవం వేడుకలను కమిటీ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా జమ్మల మడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, రంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొండారెడ్డి, కరుణాకర్ రెడ్డి, పెద్దమాబు, చిన్న మాబు, రామసుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, రంగారెడ్డి, సత్తార్, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.



ఆలయ వేడుకల్లో పాల్గొన్న భూపేష్‌రెడ్డి

నేడు సచివాలయ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎంపిపి టి.లక్ష్మయ్య తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు. మండల పరిధిలో 15 గ్రామ సచివాలయాలు ఉండగా 10 గ్రామాల్లో నూతన భవనాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఎంపిపి తెలిపారు. ఈ వారంలో అల్లాడుపల్లెతోపాటు అన్నవరంలో కూడా నూతన భవనాన్ని ప్రారంభిస్తున్నామని ఎంపిపి తెలిపారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, మైలవరం గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ ముంతాజ్ బేగం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండాపురం మండలంలోని కె. బొమ్మపల్లి గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త (బిసి.సి), ఏటూరు సహాయకురాలు (ఎస్టీ), ముద్దనూరు మండలంలోని చిన్న దుద్యాల గ్రామంలో సహాయకురాలు (ఎస్టీ), ముద్దనూరు ఎస్సీ-2 సహాయకురాలు (ఎస్సీ), మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామంలో మినీ అంగన్వాడీ కార్యకర్త (ఒసి) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ కోరారు. ఈనెల 6వ తేదీలోపు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

జమ్మలమడుగు : జమ్మలమడుగు, పెద్దముడియం, రాజుపాలెం మండలాల్లో అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి జమ్మలమడుగు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.రాజేశ్వరిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దముడియం మండలం నెమళ్లదిన్నెలో అంగన్వాడీ కార్యకర్త పోస్టు-1, రాజుపాలెం మండలం వెలవలి-2 అంగన్వాడీ కార్యకర్త పోస్టు-1, అంగన్వాడీ సహాయకులు పెద్దముడియం మండలం పెద్దపసుపుల-6, రాజుపాలెం మండలం గాదెగూడూరు-1, జమ్మలమడుగు బీసీ కాలనీ, జమ్మలమడుగు-3, జమ్మలమడుగు మండలం మోరగుడి-2లో సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జమ్మలమడుగు ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని ఆమె తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు, అందుకు సహకరించాలని ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ భూ నిర్వాసితులను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా భవనంలో మంగళవారం రోడ్డు విస్తరణకు భూములు కోల్పోయే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిని కోల్పోయేవారు ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ముఖ్యంగా రోడ్లు సంబంధించి రవాణా వ్యవస్థ బాగా ఉండాలన్నారు. రోడ్డు విస్తరణ అవసరం ఉందన్నారు. భూ సేకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు


ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉంటే నిర్మూలన సాధ్యమవుతుందని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్స్) ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక భాకరాపేట దర్గా వద్ద అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టు లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడ్ని సంప్రదించి, పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించాలన్నారు. డిపియంఒ శివశంకరయ్య మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, మందుల గురించి సచివాలయ కార్యదర్శులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, 2వ సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశాలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరాచ రాములస్వామి రథయాత్ర

ప్రజాశక్తి - చక్రాయపేట

మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీరాచరాముల స్వామి, శ్రీ వీరభద్ర స్వాముల రథయాత్ర బుధవారం నుండి ప్రారంభమవుతున్నట్లు దేవస్థాన చైర్మన్ ఓబుల్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, లాయర్ రామాజంనేయరెడ్డి తెలిపారు. ఆ మేరకు వారు మంగళవారం మాట్లాడుతూ ముఖ్యఅతిథులుగా జగద్గురు శ్రీశ్రీశ్రీ వీరజానంద స్వామి, డాక్టర్ శ్రీ కొప్పుల బయ్యారెడ్డి, వారి ధర్మపత్ని సంగమ్మ రాయచోటి వారిచే రథ యాత్ర ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రథయాత్ర చక్రాయపేటలో ప్రారంభమై మారెళ్ళమడక, కొండవాండ్లపల్లి, అద్దాలమరి, చెరుకొంపల్లి, కుమార్‌కాల్వ, సిద్ధారెడ్డి గారి పల్లె మీదుగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ ఓబుల్‌రెడ్డి

చుట్టూ దుర్గంధం.. బతుకు దుర్భరం



నివాసాల మధ్య పేరుకుపోయిన అపరిశుభ్రత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అమృతనగర్ దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఆ ప్రాంత వాసులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. అమృతనగర్‌లోని 18వ వీధిలో అంగన్వాడీ కేంద్రం ఉంది. ఈ గ్రామంలో డస్ట్‌బిన్‌లు లేకపోవడం వల్ల స్థానిక గృహిణులు తమ ఇళ్లలోని చెత్తను అక్కడక్కడ కుప్పగా వేస్తున్నారు. ఇది రోజురోజుకూ పెరిగిపోయి, దుర్గంధాన్ని వెదజల్లుతోంది. దుర్వాసన భరించలేకున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రయినేజీ సౌకర్యం లేకపోవడం వల్ల మురికినీరు రోడ్డుమీదనే ప్రవహిస్తోంది. నీటి పైప్‌లైన్ లీకేజి కారణంగా రాత్రిళ్లు మినహా పగలు అంతా నీరు బైటికి వచ్చి ఆప్రాంతమంతా అపరిశుభ్రత నెలకొంది. అపరిశుభ్రత వల్ల విషసర్పాలు సంచరిస్తున్నాయని ప్రజలు హడలిపోతున్నారు. అంగన్వాడీ కేంద్రానికి పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. పగటిపూట వెలుగులో ఎలాగోలా గడుతున్నప్పటికీ.. చీకటైతే చాలు బిక్కుబిక్కుమని గడపాల్సి వస్తోందని స్థానికులు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు ఏడాదిగా సమస్య వేధిస్తోంది. సమస్యను అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడంలేదని వాపోతున్నారు. దీనిపై కార్యదర్శిని వివరణ కోరగా.. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, తాత్కాలికంగా పరిష్కరిస్తామన్నారు. అమృతనగర్‌లో తరచూ ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతూనే ఉన్నాయి. పత్రికాముఖంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్విత ప్రాతిపదికన పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భయంగా బతుకుతున్నాం



మా ప్రాంతం అంతా అపరిశుభ్రత నెలకొంది. చెత్తాచెదారానికి మురికినీరు తోడవడం వల్ల సమస్య తీవ్రంగా తయారైంది. అపరిశుభ్రత వల్ల విష పురుగులు తిరుగుతున్నాయి. చంటి పిల్లలతో భయంగా బతుకుతున్నాం.

- గంగ, స్థానికురాలు

చీకటి పడితే హడలెత్తుతున్నాం



పగలు ఏదోలా బతుకుతున్నాం. చీకటి పడితే హడలెత్తిపోతున్నాం. ఇక్కడ ఉన్న అపరిశుభ్రతకు విష పురుగులు తిరుగుతున్నాయి. అధికారులకు చెప్పినా స్పందించడంలేదు. ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదు.

- షరీఫున్, స్థానికురాలు

అమృత్‌నగర్ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లి పంచాయతీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. అమృత్‌నగర్ 17వ వార్డులో మంగళవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచు తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, అభిమానులు రాచమల్లుకు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వస్తున్నాయా, వాలంటీర్స్, సచివాలయం సిబ్బంది బాగా పనిచేస్తున్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మాజీ మండల ఉపాధ్యక్షుడు రాజారాంరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

వైసిపి పాలనలో అన్నీ విధ్వంసాలే : ప్రవీణ్



మహిళకు అభివాదం చేస్తున్న డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నుంచి విధ్వంసాలే అన్నట్లు పాలన సాగుతోందని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. స్థానిక 10వ వార్డులో మంగళవారం రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమాన్ని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛను కోల్పోయారన్నారు. ఆర్థికంగా, మానసికంగా క్షోభ అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ఎక్కడాలేని ధరలు మన రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. రైతు ఆత్మహత్యల్లో ఎపి 3వ స్థానంలో ఉందని తెలిపారు. ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో దాడులు చేయిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోనే అభివృద్ధి, సంక్షేమం చూడగలమని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, రబ్బా చరణ్, పల్లా రాజు, పల్లా అంజిబాబు, పల్లా సాయిరాం, అంజి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వంలో అమ్మకానికి దేశం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని అమ్మకానికి పెట్టిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ విమర్శించారు. స్థానిక కల్యాణమండపంలో మంగళవారం హాత్‌సెహాత్‌జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ అమ్మకానికి పెట్టారన్నారు. నిత్యావసర సరుకులు అనూహ్యంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి, వైసిపిలు రాహువుకేతువుల్లా తయారయ్యాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో దేశంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ రావాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. ప్రత్యేకహోదా అమలు, కడపలో స్టీల్‌ప్లాంట్ సహ విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలు, సిపిఎస్ రద్దు ఓపిఎస్ అమలు తదితర అంశాలున్నాయన్నారు. అనంతరం పార్టీ ఇంచార్జి పూల నజీర్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయన్నారు. కార్యక్రమం అనంతరం ప్రచారపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గన్నారు.



ప్రచారపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గడువులోగా పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ప్లానింగ్ సెక్రెటరీ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్, కలెక్టర్ విజయ్‌రామరాజు మాట్లాడుతూ మార్చిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఉంటుందన్నారు. ఆనాటికి పనులన్నీ పూర్తికావాలన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రొజెక్టర్ ద్వారా పరిశీలించారు. అనంతరం మోడల్ టౌన్‌లో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్, ఆర్‌డిఒ వెంకటేశులు, ఇఇ సిద్ధారెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మురుకూటి'కి విశిష్ట తెలుగు సేవా పురస్కారం



అవార్డును అందజేస్తున్న సంఘ సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మురుకూటి సూర్యనారాయణరెడ్డి సేవా ట్రస్ట్ చైర్మన్ మురుకూటి సూర్యనారాయణరెడ్డికి మలషియా విశిష్ట తెలుగు సేవా పురస్కార అంతర్జాతీయ అవార్డును ఆ సంఘం నిర్వాహకులు అందజేశారు. మలేషియా సెల్టాంగర్‌లోని క్లాంగ్ నగరంలో మలేషియా తెలుగు సంఘం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా యం.పి.వై.బి.గంటబ్బిరావ్ వెర్మన్, తెలుగు సంఘం అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్, చైర్మన్ సుబ్రహ్మణ్యంచే గతనెల 28న అవార్డును అందుకున్నట్లు సూర్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. అవార్డు పట్ల కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు క్రమబద్ధీకరణపై చర్చించాలి

వేంపల్లె : క్యాబినెట్ సమావేశంలో కాంట్రాక్టు క్రమబద్ధీకరణ అంశాన్ని చర్చించాలని ఎపి డిఎస్‌సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసిపి ఎన్నికల మేనిఫెస్టో హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయసు రెగ్యులర్ ఉద్యోగులతోపాటు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు మరణిస్తే కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. వైసిపి చెప్పిన మాట ప్రకారం వెంటనే రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

4న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కడప అర్బన్ : జిల్లాస్థాయి పురుషుల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈనెల 4న నగరంలోని డిఎస్ఎ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె. మణికంఠ ఒక ప్రకటన తెలిపారు. జిల్లాలోని యువతను, క్రీడాకారులను ప్రోత్స హించాలన్న సదుద్దేశంతో వివిధ రకాల క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలను, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల వాలీ బాల్ క్రీడా బృందాలు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి ఎవరైనా కూడా ఈ వాలీబాల్ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు ప్రశంసాపత్రం, బహుమతులను అందజేస్తామన్నారు. వివరాలకు 9398391912లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మండల కాంప్లెక్స్ భవనాలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు భాగంలో ఉన్న రెండు మండల కాంప్లెక్స్ భవనాలకు ఈనెల 3న ఉదయం బహిరంగ వేలం ప్రకటన వేస్తున్నట్లు ఎంపిపి వీరనారాయణరెడ్డి తెలి పారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ఒక భవనానికి అద్దె రూ.1100గా ఇంజనీరింగ్ శాఖ నిర్ణయిం చిందన్నారు. బహిరంగ వేలంలో రూ.1100కుపైగా ఎవరైనా వేలం పాడు కోవచ్చునని తెలిపారు. పాల్గొనదలచిన వారు రూ.2000 డిడి రూపంలో ఎంపి డిఒ, బి.మఠం పేరుతో డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. వేలంలో రూమును దక్కించుకున్న వ్యక్తి మూడేళ్లపాటు నిర్వహించుకోవచ్చన్నారు. ఆ వ్యక్తి మూడు నెలల బాడుగ ముందుగా ఎంపిడిఒ కార్యాలయంలో చెల్లించాల్సి ఉంద న్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంగమునిరెడ్డి, సర్పంచు రామయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

పాఠశాల పనులు పరిశీలన

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి విద్యాభ్యాసాన్ని కొనసాగించిన మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఈనెల 2,లేదా 3న సందర్శించనున్నట్లు సమాచారం. పాఠశాలలో మనబడి, నాడు-నేడు, నాబార్డు నిధులతో నిర్మిస్తున్న తరగతి గదులను, భవనాలను ఆయన పరిశీలించనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఆ పనులను మంగళవారం కలెక్టర్ విజయ్ రామరాజు, జెసి సాయి కాంత్ వర్మ, జిల్లా అధికారులు పరిశీలించారు.

డిప్లొమా ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన డిప్లొమా మూడవ సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక సిబిఐటి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇందులో ఇసిఇ విభాగానికి చెందిన కె.ప్రవల్లిక 95.70శాతం, జి.జ్ఞాపిక 95.20, పి.రేణుక 94.10, ఇఇఇ విభాగానికి చెందిన వి.మహేంద్ర 88.63, టి.వి.సాయిచందన ప్రియ 86.72, డి.రెడ్డయ్య 85.72శాతం మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్‌లో ఇసిఇ విద్యార్థులు కె.దస్తగిరి 90, కె.చంద్రవర్షిత 89, యం.జయంతి 88.60, ఇఇఇ విభాగానికి చెందిన యం.శశాంక్ కుమార్ రెడ్డి 86శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కమల్‌హాసన్‌ను కలిసిన గండికోట సర్పంచు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భారతీయుడు-2 కథానాయకుడు కమల్‌హాసన్‌ను మంగళవారం ఉదయం గండికోట సర్పంచు కె.గురుఈశ్వర్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఆదివారం నుంచి గండికోటలో భారతీ యుడు-2 షూటింగ్‌లో కమల్‌హాసన్ పాల్గొంటున్న విషయం తెలిసిందే. అయితే ప్రతి రోజు ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుపతి నుంచి గండికోటకు వస్తారు. సాయంత్రం మళ్లీ హెలికాప్టర్‌లో తిరుపతికి వెళ్తున్నారు. డైరెక్టర్ శంకర్ ప్రొద్దుటూరులో ఒక రోజు, కడపలో ఒక రోజు షూటింగ్ అనంతరం వెళుతున్నట్లు సమాచారం. సర్పంచు గురుఈశ్వర్ మాట్లాడుతూ ప్రథమపౌరుడిగాఅగ్ర కథానాయకుడు కమలహాసన్‌కు స్వాగతం పలికానని తెలిపారు.



కమల్‌హాసన్‌కు స్వాగతం పలుకుతున్న సర్పంచు గురుఈశ్వర్

నేడు కొసినేపల్లెలో 'గడప గడపకూ'

ముద్దనూరు : మండలంలోని కొసినేపల్లె గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తేవాలని ఆయన ప్రజలకు సూచించారు.

క్రైం కార్నర్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - చెన్నూరు

మండలంలోని చిన్న మాచుపల్లిపల్లి గ్రామానికి చెందిన పోతు బోయిన మణికంఠ(20) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటిలో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకున్నాడు. మణికంఠ కడప నగరంలోని ప్రయివేట్ కాలేజిలో ఎంఎల్‌టి చదువుతున్నాడు. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మణికంఠ తండ్రి గంగయ్య వరికోత విషన్ డ్రైవర్ కావడంతో ఇతర ప్రాంతానికి వెళ్లాడు.

విద్యుత్ తీగలు తగిలి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పందుల బెడద నుండి పంటను కాపాడుకునేందుకు రైతులు కంచెకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలు తగిలి మంగళవారం ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని రాజులగురువాయపల్లెలో ఓ రైతు తన పొలానికి కంచె ఏర్పాటు చేసుకున్నాడు. విద్యుత్ లైన్ నుండి కంచెకు కరెంటు తీసుకున్నాడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు శివారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్ అధికారుల అనుమతి లేకుండా కంచెకు కరెంటు తీసుకోకూడదని ఎఇ శ్రీనివాస రాజవర్మ సూచించారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని తాళ్ళప్రొద్దుటూరు పోలీసుస్టేషన్ పరిధిలోని ఏటూరు గ్రామ పరిసర కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. సమాచారం అందుకున్న ఆయన సిబ్బందితో దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.14,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.